ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు
5
సోమవారం 25 నవంబరు 2024

ఫీజుల కోసం ఒత్తిడి చేస్తే చర్యలు

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 24, (ఆంధ్రజ్యోతి): ఫీజులు చెల్లించలేదనే విద్యార్థులపై ఒత్తిడి తెస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను రాష్ట్ర ప్రభుత్వం నేరుగా కళాశాలల బ్యాంకు ఖాతాలకే జమ చేస్తోందన్నారు. డిగ్రీ, ఇంటర్మీడియట్ విద్యార్థులకు హాల్ టికెట్లు నిరాకరించడం, తరగతులకు హాజరు కాకుండా అడ్డుకోవడం వంటి చర్యలకు పాల్పడరాదని అన్నారు. విద్యార్థుల చదువుకు ఆటంకం కలిగించే ఎలాంటి చర్యలనైనా ఉపేక్షించేది లేదని కళాశాల యజమాన్యాలను ఆదేశించారు.

సమయాన్ని వృథా చేయకండి : ఆర్ఐఓ

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సమయాన్ని వృథా చేసుకోకుండా తాము అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని ఆర్ఐవో గురువయ్యశెట్టి అన్నారు. ఆదివారం చిన్నటేకూరు బీఆర్ అంబేడ్కర్ ఐఐటీ, నీట్ అకాడమీలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నీట్, ఐఐటీలో బీడీఎస్, డీవీఎస్ సీట్లు పొందిన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆర్ఐఓ మాట్లాడుతూ చిన్నటేకూరు డా.బీఆర్ అంబేడ్కర్ ఐఐటీ, నీట్ అకాడమీలో విద్యనభ్యసించిన విద్యార్థులు ఐఐటీ, నీట్‌లో అత్యధిక సీట్లు సాధించి తమ ప్రతిభను కనబరిచారన్నారు. జిల్లా కోఆర్డినేటర్ శ్రీదేవి మాట్లాడుతూ రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చి ఉన్నత విద్యాసంస్థల్లో సీట్లు సాధించడం ఎంతో గర్వకారణం అన్నారు. అనంతరం జేఈఈ-నీట్ పరీక్షలకు సంబంధించిన 6 లక్షలు విలువ చేసిన స్టడీ మెటీరియల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులను



మాట్లాడుతున్న ఆర్ఐవో గురువయ్యశెట్టి

తీర్చిదిద్దిన ప్రిన్సిపాల్స్‌ను అధ్యాపకులును ఆర్ఐవో గురువయ్యశెట్టి, నారాయణ విద్యాసంస్థల కోర్ డీన్ పి.లింగేశ్వరరెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో ఉమామహేశ్వరప్ప, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎగ్జిక్యూటివ్ కమిటీ జాయింట్ సెక్రటరీగా కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్ నవంబరు 24, (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఐఏఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ జాయింట్ సెక్రటరీగా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఎంపికయ్యారు. ఆదివారం నిర్వహించిన స్పెషల్ జనరల్ బాడీ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ఐఏఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ కొత్త ఎగ్జిక్యూటివ్ కమిటీ ఏర్పాటుకు నామినేషన్ల ప్రక్రియ నిర్వహించి కమిటీ సభ్యులను ఎన్నుకుంది. ఈ సందర్భంగా కమిటీ జాయింట్ సెక్రటరీగా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఎంపికైనట్లు ప్రకటించారు.



శ్రీశైలం జలాశయం

హైదరాబాద్‌లో కృష్ణా బోర్డు కార్యాలయం

కర్నూలులో కృష్ణా బోర్డు పెట్టాలి..!

- శ్రీశైలం కేంద్రంగా తెలుగు రాష్ట్రాల మధ్య నీటి పంపిణీ
- ఐఏబీలో ఎంపీ, ఎమ్మెల్యేలు తీర్మానం చేస్తారా?
- రబీ సాగు నీటిపై స్పష్టత కావాలి
- నేడు సాగునీటి సలహా మండలి సమావేశం

కర్నూలు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి):

రెండు తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాలు పంపిణీకి కేంద్రం శ్రీశైలం ప్రాజెక్టు. నీటి వివాదాలు తలెత్తినప్పుడు సామరస్యంగా పరిష్కరించాలంటే అందుబాటులోనే కృష్ణా బోర్డు ఉండాలి. అది కర్నూలులో ఏర్పాటు చేస్తేనే ప్రయోజనకరంగా ఉంటుందని రాయలసీమ సాగునీటి నిపుణులు దశాబ్ద కాలంగా డిమాండ్ చేస్తున్నారు. కానీ ఇందుకు విరుద్ధంగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం జగన్ విశాఖపట్నంలో ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. అప్పట్లో ప్రజా సంఘాలు, ప్రతిపక్షాలు జగన్ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. కృష్ణా జలాలు పంపిణీ, నీటి వివాదాల పరిష్కారం కోసం కర్నూలులోనే కృష్ణా నదీయాజమాన్య బోర్డు (కృష్ణా బోర్డు) పెట్టాలని సీమ రైతులు కోరుతున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలంటే నేడు జరగనున్న రబీ సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశంలో ఏకాభిప్రాయంతో తీర్మానం చేయాలి. డిసెంబరు 3న జరిగే కేఆర్ఎంబీ సమావేశం అజెండాలో పెట్టి ఆమోదించేలా సీఎం చంద్రబాబును ఒప్పించాలి. తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ), గాజులదిన్నె ప్రాజెక్టు, హంద్రీనీవా కాలువ, కేసీ కాలువ కింద రబీ సాగునీటిపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను 2014లో ఆనాటి కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు రాష్ట్రాలుగా విభజించారు. రెండు రాష్ట్రాల మధ్య ప్రవహిస్తున్న కృష్ణా, గోదావరి నదుల నీటి పంపకాలు, వివాదాల పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 పార్ట్ 9 సెక్షన్-86 ప్రకారం కృష్ణా నదీయాజమాన్య బోర్డు (కృష్ణా బోర్డు), గోదావరి నదీయాజమాన్య బోర్డు (గోదావరి బోర్డు) ఏర్పాటు చేశారు. గోదావరి బోర్డు తెలంగాణలో, కృష్ణా బోర్డు ఏపీ కేంద్రంగా నిర్వహించాలని విభజన చట్టంలో పొందుపరిచారు. ఈ రెండు బోర్డులు కేంద్ర జలవనరుల శాఖ పరిధిలో పని చేసే స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థలు. రాష్ట్ర విభజన తరువాత పదేళ్లు ఉమ్మడి రాజధాని హైదరాబాద్‌లో కృష్ణా బోర్డు ఏర్పాటు చేసిన అక్కడి నుంచే కార్యకలాపాలు కొనసాగించారు. కర్నూలులో కృష్ణా బోర్డు పెట్టాలని రాష్ట్ర విభజన నాటి నుంచి రాయలసీమ సాగునీటి నిపుణులు, రైతు సంఘాలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీ నాయకులు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. కర్నూలు, విజయవాడ కాకుండా కృష్ణా నదికి ఏమాత్రం సంబంధమే లేని విశాఖపట్నంలో ఏర్పాటు చేయాలని 2021లో అప్పటి వైసీపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నాటి సీఎం జగన్ నిర్ణయంపై రాయలసీమ రైతు, ప్రజా సంఘాలు భగ్గుమన్నాయి. ఈ క్రమంలో కర్నూలులో ఏర్పాటు చేయడమే సముచితమని మెజార్టీ సాగునీటి నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

మిగతా 7లో..

పేదవర్గాలకు సహకారం అందించాలి

విజయవాడ వెస్ట్ ఎమ్మెల్యే సుజనా చౌదరి

7లో..



నడకతోనే ఆరోగ్యం: డీఎంహెచ్‌వో

కర్నూలు హాస్పిటల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ నడకను జీవితంలో భాగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని డీఎంహెచ్‌వో డా.ఎల్.భాస్కర్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం 7 గంటలకు ధన్వంతరీ జయంతి వారోత్సవాల సందర్భంగా ఆరోగ్య భారతి కర్నూలు శాఖ నగరంలోని కొండారెడ్డి బురుజు వద్ద నడకతో ఆరోగ్యం కార్యక్రమం కింద మార్నింగ్ వాక్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ నడక పాతబస్టాండు అంబేడ్కర్ విగ్రహం నుంచి రాజ్‌విహార్ వివేకానంద సర్కిల్ వరకు తిరిగి పాతబస్టాండు వరకు కొనసాగింది. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రతి మనిషికి శారీరక శ్రమ ఎంతో అవసరమన్నారు. ఆరోగ్య భారతి జిల్లా అధ్యక్షుడు డా.పి.మోక్షేశ్వరుడు, వీఆర్ హాస్పిటల్ క్యాన్సర్ శస్త్ర చికిత్స నిపుణుడు డా.సి.వాసురెడ్డి మాట్లాడుతూ ప్రతిరోజూ 30 నిమిషాలు, వారంలో ఐదు రోజులు వ్యాయామంగానీ, నడక గానీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య భారతి రాష్ట్ర కార్యదర్శి రామశర్మ, ఉపాధ్యక్షులు డా.ద్వారం ప్రభాకర్ రెడ్డి, దంత వైద్యులు డా.పవన్ కుమార్ మౌళి, ఆయుర్వేద వైద్యులు మురళీధర్ పాల్గొన్నారు.



మార్నింగ్ వాక్ చేస్తున్న డీఎంహెచ్‌వో తదితరులు

చేనేతలకు శుభవార్త

- త్వరలో ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు
- బనవాసి దగ్గర టెక్స్‌టైల్ పార్కు స్థలాన్ని పరిశీలించిన మంత్రి

ఎమ్మిగనూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా ఎమ్మిగనూరు చేనేతలు ఎదురు చూస్తున్న టెక్స్‌టైల్ పార్కు కల ఎట్టకేలకు సాకారం కానుంది. ఆదివారం పట్టణంలో నిర్వహించిన భక్త కనకదాసు జయంతి వేడుకల్లో పాల్గొన్న మంత్రి ఎమ్మిగనూరులో త్వరలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే కలెక్టర్ దగ్గర ఫైల్ ప్రాసెసింగ్‌లో ఉందని తెలిపారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయంలో టెక్స్‌టైల్ పార్కు కోసం కేటాయించిన స్థలాన్ని ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ పరిశ్రమ ద్వారా ఐదువేల మందికి ఉపాధి దక్కుతుందన్నారు. దివంగత బీవీ మోహన్ రెడ్డి కలను ఆయన కుమారుడు ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి నెరవేరుస్తున్నట్లు ఆమె తెలిపారు. తన చిన్న తనంలోనే బీవీ మోహన్ రెడ్డి ఎమ్మెల్యే అవుతానని జోస్యం చెప్పారని, తన తండ్రితో బీవీ మోహన్ రెడ్డికి ఉన్న అనుబంధాన్ని ఆమె గుర్తు చేసుకున్నారు. ఎమ్మిగనూరుతో పాటు అనంతపురం జిల్లాలోని రాయదుర్గం, పామిడి ప్రాంతాల్లో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రాయలసీమలో సాగునీరు, తాగునీరు, పరిశ్రమలు తెచ్చిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదేనన్నారు. కర్నూలు జిల్లాల్లో బీసీ హాస్టళ్లు, బీసీ



మంత్రిని సన్మానిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

రెసిడెన్షియల్ స్కూల్స్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. కురువలు తమ పిల్లలకు విద్యనందించాలని ఆమె పిలుపునిచ్చారు. మాదాసి కురువను ఎస్సీ జాబితాలో చేర్పించే విషయంపై ఇప్పటికే సీఎం చంద్రబాబు, మంత్రి నారాలోకేష్‌తో చర్చించామన్నారు. కర్నూలు జిల్లాలోని నాయకులతో కమిటి ఏర్పాటు చేయాలని సూచించారని చెప్పారు.

- ఎమ్మిగనూరులో ఘనంగా భక్త కనదాసు జయంతి వేడుకలు ఎమ్మిగనూరు పట్టణంలోని ఇండస్ గ్లోబల్ పాఠశాల ఆవరణంలో ఆదివారం కురువల ఆరాధ్యదైవం భక్త కనకదాసు జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి, ఎంపీలు టీకే పార్థసారథి, బస్తిపాటి నాగరాజు, కురువలు పెద్దఎత్తున పట్టణ పురవీధులగుండా బైక్‌లపై ర్యాలీ నిర్వహించి సభాస్థలానికి చేరుకున్నారు. అక్కడ భక్త కనకదాసు చిత్రపటానికి పూజలు చేశారు. ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఎమ్మిగనూరు మార్కెట్ యార్డు పదవిని బీసీల్లో కురువలకు ఇస్తున్నట్లు తెలిపారు. వేడుకల్లో కురువ కార్పొరేషన్ ఛైర్మన్ దేవేంద్రప్ప, డైరెక్టర్ రామకృష్ణ, జడ్పీ మాజీ ఛైర్మన్ బత్తిన వెంకటరాముడు, నాయకులు మద్దిలేటి, బీరప్ప, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏ చెల్లించాలి

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న డీఏలను చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వానికి రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ ప్రధాన కార్యదర్శి ఎస్ఎం షరీఫ్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడు తూ సకాలంలో డీఏలు, పీఆర్సీలు చెల్లిస్తామన్న ఎన్నికల హామీలను నెరవేర్చాలని కోరారు. దీర్ఘకాలికంగా ఉన్న ఆర్థిక బకాయిలు చెల్లించాలని కోరారు. కూటమి ప్రభుత్వంపై ఉద్యోగ ఉపాధ్యాయు లు పెట్టుకున్న ఆశలను వమ్ము చేయరాదన్నారు.

నేడు 'కుడా' చైర్మన్‌గా సోమిశెట్టి ప్రమాణస్వీకారం

● హాజరుకానున్న మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు



కర్నూలు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్మన్‌గా సోమిశెట్టి వెంకటేశ్వర్లు సోమవారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్ధన్‌రెడ్డి, టీజీ భరత్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి సహా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు ముఖ్యనాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు. సుంకేసుల రోడ్డులోని ఎంఆర్‌సీ కన్వేషన్ హాల్లో జరిగే భారీ సభలో సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రమాణస్వీకారం చేయనున్నారు. కుడా చైర్మన్‌గా సోమిశెట్టి రెండోసారి బాధ్యతలు స్వీకరించబోతున్నారు.

'కుడా' చైర్మన్‌కు సన్మానం

కర్నూలు కల్చరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా)సంస్థ చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లును కల్లూరు పారిశ్రామికవేత్తల సంఘం, కర్నూలు పిరమిడ్ ఆధ్యాత్మిక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. నగరంలోని కొత్త బస్టాండు సమీపంలోని హోటల్ త్రిగుణ క్లర్క్స్ సమావేశ హాలులో ప్రముఖ పారిశ్రామికవేత్త, కర్నూలు పిరమిడ్ సంస్థ వ్యవస్థాపకులు బీవీ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పారిశ్రామికవేత్తలు కేజే రెడ్డి, రామకృష్ణారెడ్డి, సాయిరెడ్డి, రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి. పుల్లయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అభివృద్ధి రంగంలో కర్నూలు అగ్రస్థానంలో ఉండాలని, అందుకు కుడా చైర్మన్‌గా పదవి స్వీకరించిన సోమిశెట్టి వెంకటేశ్వర్లు కృషి చేయాలని కోరారు. సోమిశెట్టి వెంకటేశ్వర్లును రెండోసారి కుడా చైర్మన్‌గా ఎంపిక చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు పారిశ్రామికవేత్తలు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీలో అంకితభావంతో పని చేసిన ఆయన తన సేవలను కర్నూలు నగర అభివృద్ధికి వినియోగించాలని పిరమిడ్ ఆధ్యాత్మిక కేంద్రం సభ్యులు పేర్కొన్నారు.



సోమిశెట్టి వెంకటేశ్వర్లును సత్కరిస్తున్న పారిశ్రామికవేత్త బీవీ రెడ్డి తదితరులు

హాస్యం ఆరోగ్యానికి టానిక్ లాంటిది

- నగర పాలక సంస్థ కమిషనర్ ఎస్. రవీంద్రబాబు

కర్నూలు కల్చరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యానికి హాస్యం టానిక్ వంటిదని, ఇది నేటి ఆధునిక జీవితంలో ప్రతి ఒక్కరికీ అవసరమని నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్ రవీంద్రబాబు అన్నారు. ఆదివారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో 'జబర్దస్త్' టీవీ కళాకారుల హాస్య ప్రదర్శనలు నిర్వహించారు. హాస్యవల్లరి పేరుతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కమిషనర్ ఎస్ రవీంద్రబాబుతోపాటూ ఎస్ఈ రాజశేఖర్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ గత ఇరవై ఏళ్లుగా టీజీవీ కళాక్షేత్రంలో నిత్యం సాంస్కృతిక, సాహితీ కార్యక్రమాలు జరుగుతున్నాయని ఇది అభినందనీయమైన విషయమని చెప్పారు. కళ వినోదంతోపాటూ విజ్ఞానాన్ని అందిస్తుందని చెప్పారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ కార్తీక మాసం చివరి ఆదివారం రోజున నగర ప్రజలకు వినోదం పంచేందుకు జబర్దస్త్ కళాకారులతో హాస్య వల్లరి ఏర్పాటు చేశామని అన్నారు. అంతకు ముందు జబర్దస్త్ కళాకారులను అతిథులు ఘనంగా సత్కరించారు.

● ఆసాంతం అలరించిన హాస్య వల్లరి

టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి జబర్దస్త్ కళాకారులు ప్రదర్శించిన హాస్య వల్లరి అసాంతం ఆకట్టుకుంది. నిత్య జీవితంలో ఎదురయ్యే వివిధ సంఘటనలకు హాస్యం జోడిస్తూ కళాకారులు ప్రదర్శించిన అంశాలన్నీ ఆకట్టుకున్నాయి. మతిమరుపు, పిసినారి తనం, అతి మంచితనం, ఇరుగు పొరుగు వారి మధ్య తగాదాలు, కుటుంబంలో జరిగే అనుకోని సంఘటనలు వంటి వాటి ఆధారంగా వివిధ స్కిట్స్‌లను కళాకారులు పండించి ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించారు. జబర్దస్త్ కళాకారులు అప్పారావు, వినోదని(వినోద్), గుండు మురళీ, అల్లరి అర్జున్, నవీన్, ఎస్ఆర్ఎస్ ప్రసాద్ తదితరులు ఈ ప్రదర్శనలు ఇచ్చారు. కార్యక్రమంలో టీజీవీ కళాక్షేత్రం కార్యవర్గ సభ్యులు ఇనాయతుల్లా, లక్ష్మీకాంతరావు, వాల్మీకి రాముడు, బాల వెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి, క్రిస్టఫర్, యాగంటీశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.



జబర్దస్త్ కళాకారులను సత్కరిస్తున్న పత్తి ఓబులయ్య తదితరులు

సమస్యలు పరిష్కరించండి

ఓర్వకల్లు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): నన్నూరు గ్రామంలో ముస్లిం, మైనార్టీ సమస్యలను పరిష్కరించాలని ఆదివారం నన్నూరు గ్రామం ముస్లింలు ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. టీడీపీ నాయకుడు విశ్వేశ్వరరెడ్డి ఖాజామియ్య, శంషుద్దీన్, వలిబేగ్ ఉన్నారు.

ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరించండి : వాల్మీకి సంఘం

కర్నూలు కలెక్టరేట్ నవంబరు 24, (ఆంధ్రజ్యోతి): వాల్మీకి బోయలకు ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరించాలని వాల్మీకి బోయ సంఘం నాయకులు అన్నారు. శనివారం నగరంలోని వెంకటనాయుడు ఫంక్షన్ హాల్లో వాల్మీకి బోయల కార్తీక వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎస్టీ రిజర్వేషన్ కోసం లక్ష మందితో సభ నిర్వహిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ఎస్టీ రిజర్వేషన్ అమలు చేసి వాల్మీకి బోయలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ బొజ్జమ్మ, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ బొజ్జమ్మ, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్లు సంజీవలక్ష్మి, మంజునాథ్, మురళి, రామకృష్ణ అర్బన్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు సివిల్ సప్లయ్ డైరెక్టర్ మహేష్ నాయుడు, వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తలారి కృష్ణ, బేతం కృష్ణుడు, శేఖర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నామినేటెడ్ పదవులు దక్కిన వారికి సన్మానిస్తున్న దృశ్యం

ప్యాలకుర్తిలో టీడీపీ సభ్యత్వ నమోదు

కోడుమూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం టీడీపీ ఎస్సీ సెల్ మాజీ మండల అధ్యక్షుడు చంద్రమౌళి ప్రారంభించారు. గ్రామంలో 1, 2వ వార్డులోని ఎస్సీ కాలనీలో ఇంటింటికి తిరిగి కార్యకర్తల చేత సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు.

PUBLIC NOTICE

UNDER the instructions of my Client M/s. Shriram Finance Limited, Chennai, Branch at Kurnool, I issue the following notice to general public. My Clients intends to grant loan to **Sri. Kasepogu Yesu, S/o. Sri. Kasepoguu Savari, Resident of Godur Village & Mdl, Kurnool Dist.,** by keeping the below mentioned of property of him as security by way of Registered Mortgage. As such if anyone have any claims, charges, Mortgages, Sale agreements, Court attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in writing within 7 days from the date of this notice. Otherwise later objections will not bind on my client in this regard.

SCHEDULE OF THE PROPERTY

The Property is open site, in Sy.No.61/A3 of Guduru with in Sub Registration office of Guduru and Dist. Registration office of Kurnool and bounded as follows. **East:** Land of M.Peddaiah, **West :** Remaining Land of Vendor, **North:** Road, **South:** Land of V.Seetha Rami Reddy, **Extent : 0.12** Cents.

Byreddy Venkata Ramana Reddy
Advocate, Kurnool, Cell:94400 79646

PUBLIC NOTICE

UNDER the instructions of my Client M/s. Shriram Finance Limited, Chennai, Branch at Kurnool, I issue the following notice to general public. My Clients intends to grant loan to **Sri. M.Sagar, S/o. Late. M.Ramudu, Resident of H.No.76-97-115-6, Weaker Section Colony, Near Ulchala Road, Kallur, Kurnool.,** by keeping the below mentioned of property of him as security by way of Registered Mortgage. As such if anyone have any claims, charges, Mortgages, Sale agreements, Court attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in writing within 7 days from the date of this notice. Otherwise later objections will not bind on my client in this regard.

SCHEDULE OF THE PROPERTY

The Property is open site, in Sy.No.47/A9 of Mamidalapadu, Kurnool Dist. with in Sub Registration office of Kurnool and Dist. Registration office of Kurnool and bounded as follows. **East:** Rastha, **West :** Land of Thirupathaiah, **North:** Land of Bojjanna, **South:** Land Bade Sab, **Extent : 484** Sq.yards.

Byreddy Venkata Ramana Reddy
Advocate, Kurnool, Cell:94400 79646

PUBLIC NOTICE

UNDER the instructions of my Client M/s. Shriram Finance Limited, Chennai, Branch at Kurnool, I issue the following notice to general public. My Clients intends to grant loan to **Sri. A.Chand Basha, S/o. Sri.A.Abdul Gafoor, H.No.7/97-261, Weaker Section Colony, Kallur, Kurnool.,** by keeping the below mentioned of property of him as security by way of Registered Mortgage. As such if anyone have any claims, charges, Mortgages, Sale agreements, Court attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in writing within 7 days from the date of this notice. Otherwise later objections will not bind on my client in this regard.

SCHEDULE OF THE PROPERTY

The Property is open plot No.2, in Sy.No.301/B1 & 302/1 of Kallur layout approved as Guru Raghavendra Traders vide L.P.No.121/81, with in Sub Registration office of Kallur and Dist. Registration office of Kurnool and bounded as follows. **East:** plot No.3, **West :** Plot No.1, **North:** 40'feet road, **South:** Plot No.8, **Extent : 266.66** Sq.yards.

Byreddy Venkata Ramana Reddy
Advocate, Kurnool, Cell:94400 79646

రెండు కార్లు ఢీకొని ఇద్దరి దుర్మరణం

శుభకార్యానికి వెళ్తూ ఒకరు.. ఆలయం నుంచి వస్తూ మరొకరు..

కన్నీటిపర్యంతమైన మృతుల స్నేహితులు, బంధువులు



మృతిచెందిన చంద్రశేఖర్ ఖాదర్ బాషా

శిరివెళ్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రెండు కార్లు ఢీకొన్న ఘటనలో ఇద్దరు దుర్మరణం చెందారు. కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిపై శిరివెళ్ల మండలం గోవిందపల్లె గ్రామ సమీపంలో ఆదివారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. నంద్యాల పట్టణంలోని నడిగడ్డకు చెందిన షేక్ ఖాదర్ బాషా శిరివెళ్లలోని బంధువుల ఇంట్లో జరుగుతున్న ఓ శుభకార్యంలో పాల్గొనేందుకు కారులో బయలుదేరాడు. శిరివెళ్ల మండలం గోవిందపల్లె గ్రామ సమీపంలో కారు టైరు పేలడంతో అదుపు తప్పింది. దీంతో డివైడర్‌ను ఢీకొట్టి రోడ్డు దాటి కర్నూలుకు వెళ్తున్న చంద్రశేఖర్ కుటుంబం ప్రయాణిస్తున్న కారును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఓ కారు నడుపుతున్న షేక్ ఖాదర్ బాషా (24), మరో కారులోని చంద్రశేఖర్(65) అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడు చంద్రశేఖర్ భార్య ఈశ్వరమ్మ, కుమారుడు రవి కుమార్ తీవ్రంగా గాయపడడంతో వారిని 108 వాహనంలో నంద్యాల వైద్యశాలకు తరలించారు. శిరివెళ్ల ఎస్ఐ చిన్న పీరయ్య తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ప్రమాదం చోటుచేసుకున్న తీరును పరిశీలించారు. మృతదేహాలను పంచనామా నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు.

చంద్రశేఖర్ రిటైర్డు ఎస్ఐ..

చంద్రశేఖర్ ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఆళ్లగడ్డ, ఉయ్యాలవాడ, సంజామల, నందివర్గం తదితర పోలీస్ స్టేషన్‌లలో పని చేసి 2022లో ఎస్ఐగా పదవీ విరమణ పొంది శేష జీవితం గడుపుతున్నాడు. ఈ నెల 22వ తేదీన భార్య, కుమారుడితో కలిసి పుణ్యక్షేత్రాలు దర్శించుకునేందుకు కారులో బయలుదేరి వెళ్లారు. అరుణాచలేశ్వరుడి దర్శనానంతరం ఆదివారం ఉదయం కర్నూలుకు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఖాదర్ బాషా మాత్రం నంద్యాలలోని ఓ పేపర్ ప్లేట్ల తయారీ దుకాణంలో పని చేసేవాడు.

స్నేహితుడి మృతిని జీర్ణించుకోలేక..

కలిసిమెలిసి స్నేహం చేసిన మిత్రుడు ఖాదర్ బాషాను విగతజీవిగా చూడడంతో సహచర స్నేహితులు కన్నీరుమున్నీరుగా విలపించిన తీరు ప్రజలను సైతం కంటతడి పెట్టించింది. శుభకార్యంలో సందడిగా గడపాల్సిన యువకుడు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడన్న చేదు నిజాన్ని స్నేహితులు, బంధువులు జీర్ణించుకోలేకపోయారు. షేక్ ఖాదర్ బాషా మృతదేహాన్ని పంచానామా నిమిత్తం తరలించే సమయంలో వారి రోదనలు మిన్నంటాయి.

ప్రియాంక గాంధీ గెలుపు పట్ల హర్షం

కర్నూలు అర్బన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీ అత్యధిక మెజార్టీతో గెలుపొందడం పట్ల డీసీసీ అధ్యక్షుడు పరిగెల మురళీకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వయనాడులో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత ప్రియాంక గాంధీ అఖండ విజయాన్ని సాధించారని అన్నారు. భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ప్రతిరూపం ప్రియాంక పార్లమెంట్‌లో అడుగుపెట్టబోతున్నారని తెలిపారు. దీంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొందన్నారు. రాష్ట్రంలో షర్మిలమ్మ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు కాంగ్రెస్ వెంటే ఉన్నారని తెలిపారు. దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. జార్ఖండ్ ఎన్నికల ఫలితాలు భవిష్యత్‌లో అన్ని రాష్ట్రాల్లో పునరావతమవుతాయని అభిప్రాయపడ్డారు.

సిల్వర్‌జూబ్లీలో జీసీటీఏ ఎన్నికలు

కర్నూలు అర్బన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకులకు సంబంధించిన ప్రభుత్వ కాలేజీ టీచర్స్ అసోసియేషన్(జీసీటీఏ) ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. నగరంలోని సిల్వర్ జూబ్లీ కళాశాలలో జరిగిన ఎన్నికల్లో జిల్లాలోని వివిధ కళాశాలల నుంచి 73 మంది అధ్యాపకులు పాల్గొన్నారు. అధ్యక్షులుగా డాక్టర్ డాలు నాగన్న, సెక్రటరీగా డాక్టర్ దళవాయి శ్రీనివాసులు, మహిళా కార్యదర్శిగా ఎ.జయలక్ష్మి, కోశాధికారిగ జి. దేవదానం, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారిగా సీ. రమేష్, పర్యవేక్షణ అధికారిగా ఎస్. వెంకకృష్ణయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా బలిజ సంఘం వనభోజనం



న్యాయవాది రామచంద్రరావును సత్కరిస్తున్న నాయకులు

కర్నూలు కల్చరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): నగర బలిజ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజన మహోత్సవం ఘనంగా సాగింది. నగర శివారులోని జి. పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వెనుక ఉన్న విజ్ఞాన పీఠం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి కాపు, బలిజ, తెలగ, మున్నూరు కాపు కులాల వారు వందలాదిగా హాజరయ్యారు. కిసాన్ ఘాట్ సమీపంలోని శ్రీకృష్ణదేవరాయల విగ్రహం నుంచి విజ్ఞాన పీఠం వరకు బైకులు, కార్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉసిరిక చెట్టు వద్ద పూజలు చేసి వనభోజన కార్యక్రమాలను ప్రారంభించారు. నగర బలిజ సంఘం అధ్యక్షుడు గాండ్ల లక్ష్మన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రముఖ న్యాయవాది రామచంద్రరావు హాజరయ్యారు. మహిళలు, పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేశారు. అంతకు ముందు బలిజ యువజన సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీజీవీ కళా క్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, ప్రధాన కార్యదర్శి ఎం. రవికుమార్ రాయల్, కోశాధికారి శైలేష్ రాయల్, బలిజ సంఘం ప్రముఖులు ఆర్గా రామకృష్ణ, డాక్టర్ వై. సత్యనారాయణ, డాక్టర్ కుళ్లాయప్ప, చింతలపల్లి రామకృష్ణ, కోనేటి వెంకటేశ్వర్లు, రాజారామ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న బలిజ యువజన సంఘం నాయకులు

పేదవర్గాలకు సహకారం అందించాలి

ఎమ్మెల్యే సుజనా చౌదరి

కమ్మసంఘం ఆధ్వర్యంలో ఘనంగా కార్తీక వనభోజనం

కర్నూలు కల్చరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పేద వర్గాలకు వైద్య, విద్య, ఉపాధి రంగాల్లో సహకారం అందించడానికి కమ్మ సంఘం నాయకులు కృషి చేయాలని కేంద్ర మాజీ మంత్రి, విజయవాడ వెస్ట్ ఎమ్మెల్యే సుజనా చౌదరి పిలుపునిచ్చారు. ఆదివారం కర్నూలు నగరంలోని కాకతీయనగర్ కమ్మ సంఘం ప్రాంగణంలో కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఉసిరి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సుజనా చౌదరి మాట్లాడుతూ పేద వర్గాలకు జిల్లా కమ్మ సంఘం ద్వారా తనవంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సుజనా చౌదరి మాట్లాడుతూ కమ్మ కులస్థులు తమతో పాటు ఇతర కులాల వారిని కూడా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ టీడీపీ స్థాపించిన సమయంలోనూ బడుగు, బలహీన వర్గాల వారిని ప్రోత్సహించి రాజకీయంగా వారికి ఎన్నో అవకాశాలు కల్పించారన్నారు. ప్రతి ఒక్కరూ ఆ మహనీయుడిని ఆదర్శంగా



జిల్లా అధ్యక్షుడు కమ్మ కృష్ణమోహన్‌ని సత్కరిస్తున్న కమ్మ సంఘం నాయకులు

తీసుకోవాలన్నారు. జిల్లా అధ్యక్షుడు కమ్మ కృష్ణమోహన్ మాట్లాడుతూ అందరూ సమైక్యంగా ఉంటేనే సంఘం బలపడుతుందన్నారు. పారిశ్రామికవేత్త యార్లగడ్డ హరిశ్చంద్ర ప్రసాద్ మాట్లాడుతూ అభివృద్ధే ధ్యేయంగా కుల సంఘాలు పనిచేయాలని సూచించారు. ఏపీ కమ్మ సేవా సమాఖ్య జనరల్ సెక్రటరీ బెజవాడ వెంకట్రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పేదవారి అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించి వారి విద్యాభివృద్ధికి సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమ్మ సంఘం కార్యదర్శి పెనికలపాటి రాజశేఖర్, ఏపీ కమ్మ సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్ మురుకొండ బోసుబాబు, కార్యదర్శులు వెలగ కోటేశ్వరరావు, తమ్మినేని రమేష్, మాంటిస్సోరి పాఠశాల డైరెక్టర్ కేఎస్‌వీ రాజశేఖర్, రిటైర్డ్ ఏఎస్పీ రామప్పగారి వెంకన్న చౌదరి, మాజీ అధ్యక్షుడు వడ్లమూడి చలమయ్య, మోదేపల్లి సుబ్బరాయుడు, కుసుపాటి రాజగోపాల్, మాజీ కార్పొరేటర్ జంపాల మధుసూదన్‌రావు, కార్యవర్గ సభ్యులు నాగిరెడ్డి, కల్యాణ మంటపం పర్యవేక్షకుడు కుసుపాటి బాబ్జి, అమిత్, యోగానంద హర్షవర్ధన్, చంద్రశేఖర్, కేశవరామ్ చౌదరి, సోంపల్లి శేఖర్, నాగేశ్వరరావు, పి.హనుమంతరావు చౌదరి, ఉన్నం వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక నృత్యాలు, మ్యాజిక్ షో, ఆటల పోటీలు అలరించాయి.

కురువలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

కల్లూరు, నవంబరు 24: కురువలు అన్ని రంగాల్లో రాణించి ఉన్నతస్థాయికి చేరాలని కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు పిలుపునిచ్చారు. ఆదివారం కల్లూరు మండల మోడల్‌స్కూల్ సమీపంలోని బీరప్ప దేవాలయంలో చేపట్టిన 22వ కార్తీక వనభోజన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కురువ సంఘం ప్రధాన కార్యదర్శి కె.రంగస్వామి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుడిసె శివన్న, జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జున, కల్లూరు తహసీల్దారు కె. ఆంజనేయులు, గొర్రెల సంఘం చైర్మన్ శ్రీనివాసులు, నాయకులు గడ్డం రామకృష్ణుడు, సత్యనారాయణమ్మ, అరుణకుమారి, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటరు నమోదులో అప్రమత్తంగా ఉండాలి: జేసీ

కల్లూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ఓటర్ నమోదులో బీఎల్ఓలు, సూపర్ వైజర్లు అప్రమత్తంగా పనిచేయాలని పాణ్యం రిటర్నింగ్ ఆఫీసర్, జాయింట్ కలెక్టర్ బి.నవ్య అన్నారు. ఆదివారం కల్లూరు మండలం పరిధిలో రెండు రోజుల ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా కల్లూరు తహసీల్దారు కె.ఆంజనేయులతో కలిసి జాయింట్ కలెక్టర్ 59, 60, 61, 62, 65, 66, 67, 68, 119, 120, 121 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా జాయింట్ కలెక్టర్ బి.నవ్య మాట్లాడుతూ 18 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేయించుకోవాలని, చేర్పులు, మార్పులకు దరఖాస్తులు స్వీకరించాలని అన్నారు. సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో దరఖాస్తుల ను పరిశీలించి ఓటరు నమోదులో పారదర్శకత పాటించాలన్నారు.

ఎంపీ బస్తిపాటికి సత్కారం

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ హాస్టళ్లు, బీసీ రెసిడెన్షియల్ పాఠశాలల భవనాల మరమ్మతుల కోసం తన ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.కోటి నిధులు కేటాయించిన కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజును బీసీ వెల్ఫేర్ అధికారులు ఆదివారం సత్కరించారు. ఆయన నివాసానికి వెళ్లిన ఉద్యోగులు పుష్పగుచ్ఛం శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి వెంకటలక్ష్మి మాట్లాడుతూ హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేసిన వెంటనే స్పందించి రూ.కోటి నిధులు కేటాయించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు శ్రీనివాసులు, ఆంజనేయులు, మహాలక్ష్మి, కనకలత, గిరిజ, శంకర్, ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ బస్తిపాటి నాగరాజును సత్కరిస్తున్న బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటలక్ష్మి, సిబ్బంది



ఎమ్మెల్యే గౌరు చరితను సన్మానిస్తున్న విశ్వబ్రాహ్మణులు

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

కల్లూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విశ్వబ్రాహ్మణులు అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత అన్నారు. ఆదివారం ఉల్చాల రోడ్ సమీపంలోని హిందూస్థాన్ నగర్ శ్రీగాయత్రీ విశ్వకర్మ వీరభద్ర ఆలయంలో ఈశ్వరిమాతా సేవా ట్రస్ట్ చైర్మన్, నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ ఆధ్వర్యంలో చేపట్టిన మొదటి కార్తీక వనభోజన ఆత్మీయ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం మహిళా అధ్యక్షురాలు కె.క్రిష్ణవేణి, కె.పార్వతమ్మ, జనార్ధన్ ఆచారి, రాఘవేంద్ర ఆచారి, సంఘం నాయకులు పాల్గొన్నారు.

కుమ్మరుల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే గౌరు



సమావేశంలో మాట్లాడుతున్న గౌరుచరిత

కల్లూరు, నవంబరు 24:(ఆంధ్రజ్యోతి): కుమ్మరుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే గౌరుచరిత అన్నారు. ఆదివారం స్థానిక నంద్యాల రోడ్ పుల్లారెడ్డి కాలేజీ సమీపంలోని ఏఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో శాలివాహన కుమ్మర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. గౌరుచరిత మాట్లాడుతూ క్మురుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. సంఘం గౌరవ అధ్యక్షులు, రవీంద్ర విద్యాసంస్థల అధినేత గూడూరు పుల్లయ్య మాట్లాడుతూ కుమ్మరులు ఐకమత్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కుమ్మరి శాలివాహన సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు కె.సోమేష్, ప్రధాన కార్యదర్శి కె.బజారప్ప, గూడెంపాడు శ్రీనివాసులు, సంఘం నాయకులు నరసింహ బాబు, కే.లింగన్న, మధు, పెద్దఈశ్వర్, నాగేంద్ర, రామచంద్రుడు పాల్గొన్నారు.

ఐక్యత కోసమే కార్తీక వనభోజనం



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆయా కులాలు, సంఘాలలో సమైక్యత చాటడానికి కార్తీక మాస సామూహిక వనభోజన కార్యక్రమాలు తోడ్పడతాయని ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని బొడ్డువానిపల్లె ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో దాత పుసులూరు ప్రభాకర్‌రెడ్డి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సర్వజన కార్తీక వనభోజన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డితో పాటు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి వేరువేరుగా హాజరై ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు జరిపించారు. కార్యక్రమంలో పాలకొలను, గుట్టపాడు సర్పంచులు చదువుల సుజాతమ్మ, నర్ల మోహన్‌రెడ్డి, నాయకులు సుధాకర్‌రెడ్డి, పుసులూరు ప్రభాకర్ రెడ్డి, పుల్లారెడ్డి, పాల్గొన్నారు.

పిల్లలను క్రమశిక్షణతో పెంచండి

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తమ పిల్లలను క్రమ శిక్షణతో బాగా చదివించి ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలని తల్లిదండ్రులకు కుర్ణి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నక్కలమిట్ట శ్రీనివాసులు తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక వెంకన్నబావి ప్రాంగణంలో కుర్ణి కులస్థుల కార్తీక వనభోజన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వాసుదేవయ్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య, కేపీ రాధాకృష్ణ, చెన్నప్ప, ఎం.రామదాసు, బి.కృష్ణ, నారాయణ, జగన్నాథం, సత్యనారాయణ, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కుర్ణి సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు

భార్య చేతిలో భర్త హత్య

కర్నూలు క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలో టీవీ-9 ప్రజానగర్ కాలనీలో చిన్న (27) అనే వ్యక్తిని అతని భార్య హత్య చేసింది. పోలీసుల వివరాల మేరకు.. నందికొట్కూరుకు చెందిన చిన్న ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. బుధవారపేటకు చెందిన స్వరూప, చిన్న ఏడేళ్ల ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి ఒక కొడుకు, కూతురు సంతానం. వీరిద్దరు టీవీ-9 ప్రజానగర్ కాలనీలో నివాసముంటున్నారు. చిన్న నిత్యం తాగి భార్యతో గొడవ పడుతుండేవాడు. శనివారం అర్ధరాత్రి పూటుగా తాగి భార్యతో గొడవ పడ్డాడు. అర్ధరాత్రి తర్వాత మద్యం మత్తులో నిద్రిస్తున్న చిన్నను సమీపంలో ఉన్న ఇనుప రాడ్డు తీసుకుని తలపై బాది హత్య చేసింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి స్వరూపను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. చిన్న తల్లి పద్మావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీధర్ తెలిపారు. ఈ హత్యకు గల కారణాలను పోలీసులు పలు కోణాల్లో విచారిస్తున్నారు. స్వరూపకు ఏమైనా వివాహేతర సంబంధం ఉందా అనే విషయంలో కూడా దర్యాప్తు చేస్తున్నారు.

‘26న లోకాయుక్తకు తరలి రండి’

కర్నూలు హాస్పిటల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న బోగస్ సర్టిఫికెట్ల బాధితులంతా ఈ నెల 26న లోకాయుక్త సంస్థ ఎదుట హాజరు కావాలని ఏపీ డీఎస్సీ కాంట్రాక్టు పారా మెడికల్ ఉద్యోగుల జేఏసీ నాయకులు విజ్ఞప్తి చేశారు. బోగస్ సర్టిఫికెట్ల బాధితులంతా జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా ధర్మ పోరాట ప్రతిజ్ఞ చేద్దామని, ఇందుకు అందరు హాజరు కావాలని రాష్ట్ర కన్వీనర్ యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి, జేఏసీ రాష్ట్ర ప్రతినిధులు ముత్యాల బాలుడు, మునిరెడ్డి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. బోగస్ సర్టిఫికెట్ల వారికే మెరిట్ పేరుతో ఉద్యోగాలు ఇచ్చి నిజమైన వారికి అన్యాయం చేసిన అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ పోరాటానికి ఉద్యోగ సంఘాలు, రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వాలని కోరారు.

పోయిన సొత్తు మూడు రోజుల్లోనే రికవరీ

బాధితులకు అప్పగించిన పోలీసులు

కర్నూలు క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్టాండులో బంగారు ఆభరణాలు ఉన్న ఓ బ్యాగ్ మరిచిపోయిన కుటుంబానికి మూడు రోజుల్లోనే పోలీసులు ఆ సొత్తును అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. సున్నిపెంట గ్రామానికి చెందిన రామిరెడ్డి, ఆయన భార్య ఈ నెల 21న ఓ వివాహం కార్యక్రమానికి కర్నూలు వచ్చారు. తిరిగి సున్నిపెంటకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్టాండుకు వచ్చారు. బస్సు ఎక్కే క్రమంలో బ్యాగును బస్టాండు ఆవరణలోనే మరిచిపోయారు. అందు లో 6 తులాల బంగారు నగలు, 10 తులాల వెండీ ఆభరణాలు, రూ.12 వేల నగదు ఉంది. కొంత దూరం వెళ్లిన తర్వాత తాము బ్యాగ్ మరిచిపోయామని గుర్తించి తిరిగి బస్టాండుకు వచ్చి చూస్తే కనిపించలేదు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించగా సీఐ మధుసూదన్‌గౌడు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేశారు. బస్టాండులోని సీసీ కెమెరాలను పరిశీలిస్తే ఓ వృద్ధ దంపతులు ఆ బ్యాగ్‌ను తీసుకెళ్లినట్లు గుర్తించారు. వారు ఎక్కిన బస్సు ఆదారంగా సంబంధిత బస్సు కండక్టర్, డ్రైవర్‌లను ఆరా తీస్తే వారు దిగిన ఊరు తెలిసింది. ఫొటోల ఆ ఊరిలో వాకబు చేస్తే ఆ వృద్ధ దంపతుల ఆచూకీ లభించింది. వారి దగ్గరకు వెళ్లగా బ్యాగును పోలీసులకు అప్పగించారు. మరిచిపోయి తమ బ్యాగు స్థానంలో వేరే బ్యాగు తీసుకెళ్లినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఇంటికి వెళ్లిన తర్వాత చూస్తే నగలు కనిపించడంతో కంగారు పడిన దంపతులు ఎవరికి చెప్పాలో తెలియక ఆ బ్యాగు తమ వద్ద ఉంచుకున్నట్లు తెలిపారు. బ్యాగు పోగొట్టుకున్న దంపతులకు పోలీసులు బ్యాగ్‌ను అప్పగించారు. దీంతో పోలీసులకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వంపై అసంతృప్తి: ఎస్టీయూ

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నూతన ప్రభుత్వం ఏర్పాటై ఐదు నెలలు గడుస్తున్నప్పటికీ ఉద్యోగుల, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలపై కాలయాపన చేస్తుండటంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెన్షనర్లు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు ఎస్.గోకారి అన్నారు. ఆదివారం స్థానిక సలాంఖాన్ ఎస్టీయూ భవన్‌లో సురేష్ అధ్యక్షతన జిల్లా వార్షిక సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి టీకే జనార్దన్, రాష్ట్ర ఆర్థిక కమిటీ సుంకన్న, డి.సుధీర్, ముర్తుజావలి, గోవిందు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై ఆందోళనలు : ఏపీటీఎఫ్

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న వివిధ ఆర్థిక రకాల బకాయిల చెల్లింపులు, విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి.హృదయరాజు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఇస్మాయిల్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 6 నెలల కాలంలో పీఎఫ్, ఏపీజీఎల్ఐ, డిటెక్షన్స్ రూపంలో రూ.2,500 కోట్లు ప్రభుత్వానికి చేరిందని, కనీసం వాటినైనా దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులకు చెల్లించాలని కోరారు.

కర్నూలులో కృష్ణా బోర్డు పెట్టాలి..!

5వ పేజీ తరువాయి

- శ్రీశైలం ప్రాజెక్టు కేంద్రంగా రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నీటి పంపిణీ జరుగుతుంది. రెండు రాష్ట్రాలు విద్యుత్తు ఉత్పత్తి చేస్తున్నాయి. నీటి వినియోగంలో తరుచుగా వివాదాలు తలెత్తున్నాయి.
- కృష్ణా నదీయాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) పర్యవేక్షణలో ప్రధాన ప్రాజెక్టులు జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల ఉన్నాయి. శ్రీశైలం డ్యాం ఎగువన నికర జలాలు, వరద జలాల ఆదారంగా ఏపీలో గాలేరు-నగరి, తెలుగుగంగ, హంద్రీనీవా, వెలిగొండ, తెలంగాణ కల్వకుర్తి, నెట్టంపాడు, పాలమూరు రంగారెడ్డి, ఎస్ఎల్‌బీసీ వంటి కీలక ప్రాజెక్టులు కర్నూలుకు అత్యంత సమీపంలో ఉన్నాయి.
- తుంగభద్ర జలాలు, సుంకేసుల బ్యారేజీ, కేసీ కెనాల్, ఆర్డీఎస్ వంటి ప్రాజెక్టులకు నీటి పంపిణీ, తుంగభద్ర బోర్డు నీటి కేటాయింపులు పర్యవేక్షించాల్సి ఉంటుంది.

రబీ సాగునీటిపై స్పష్టత ఇవ్వాలి

తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) కింద ఖరీఫ్‌లో 43,519 ఎకరాలు ఆయకట్టు ఉంది. 35 వేల ఎకరాలకు సాగునీరు ఇస్తామని జూన్‌లో జరిగిన ఐఏబీలో తీర్మానించారు. 2024-25 నీటి సంవత్సరంలో ఎల్లెల్సీ వాటాగా 24 టీఎంసీలకు గానూ 21 టీఎంసీలు కేటాయించారు. ఇప్పటికే 9.20 టీఎంసీలు వాడుకోగా.. 11.80 టీఎంసీలు మిగులు ఉన్నాయి. రబీలో 1,07,615 ఎకరాల ఆయకట్టు ఉండగా 45 వేల ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. గాజులదిన్నె జలాశయంలో 2.80 టీఎంసీలు నిల్వ ఉంటే.. 0.65 టీఎంసీలు నీటి ఆవిరిపోనూ 2.10 టీఎంసీలు అందుబాటులో ఉంటుంది. వేసవి తాగునీటి అవసరాలు ఈ జలాశయంపై ఉన్నాయి. ఈ ప్రాజెక్టు కింద రబీ ఆయకట్టు 24,372 ఎకరాలు ఉంది. సాగునీరు ఇస్తారా.. లేదా..? అన్నది ప్రశ్నార్థకంగా ఉంది. గురురాఘవేంద్ర ప్రాజెక్టు, హంద్రీనీవా కాలువ, మైనర్ ఇరిగేషన్, ఏపీఎస్ఐడీసీ పథకాల ద్వారా సాగునీరు ఇచ్చే అవకాశాలు లేవని అజెండాలో ఉంచారు. జీడీపీ ఆయకట్టుకు సాగునీటిపై స్పష్టత ఇవ్వాలని జిల్లా రైతాంగం డిమాండ్ చేస్తోంది.

డిసెంబరు 3న కేఆర్ఎంబీ భేటీ

డిసెంబరు 3న కేఆర్ఎంబీ సమావేశం ఉంది. ఇప్పటికే అజెండా అంశాలను రెండు రాష్ట్ర ప్రభుత్వాలకు పంపించారు. జిల్లాకు చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కర్నూలులో కృష్ణా బోర్డు ఏర్పాటు చేయాలని నేడు జరిగే ఐఏబీ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేయాలి. అక్కడితో సరిపుచ్చకుండా సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలి. కేఆర్ఎంబీ సమావేశంలో ఈ అంశం కూడా అజెండాలో చేర్చి ఆమోదించేలా రాజకీయంగా తీవ్ర ప్రయత్నాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రేపు మండల సమావేశం: ఎంపీడీవో

పత్తికొండ టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26న పత్తికొండ మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సువర్ణలత ఆదివారం తెలిపారు. స్థానిక ఎంపీపీ హాలులో ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని, ప్రజా ప్రతినిధులు తప్పక హాజరు కావాలన్నారు. ముఖ్య అతిథిగా పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు పాల్గొంటారన్నారు.

దారి ఆక్రమణ



పంచాయతీ స్థలాన్ని కబ్జా చేసి పాతిన బండలు

మద్దికెర, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పశువైద్యశాల వెనకభాగంలో దారి ఆక్రమించి కొందరు బండారు పాతారు. ఆ స్థలం పంచాయతీ ఆధీనంలో ఉందని, గిడ్డయ్య అనే వ్యక్తి బండలు పాతడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ స్థలాన్ని కబ్జా చేసిన మాట వాస్తవమేనని, నోటీసులు ఇచ్చి ఖాళీ చేయకపోతే ఖాళీ చేయిస్తాం.

వాల్మీకులు రాణించాలి

• వనభోజనంలో ఎమ్మెల్యే విరుపాక్షి



వనభోజనంలో మాట్లాడుతున్నఎమ్మెల్యే విరుపాక్షి

ఆలూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వాల్మీకులు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రాణించాలని ఆలూరు ఎమ్మెల్యే బి.విరుపాక్షి పిలుపు నిచ్చారు. ఆదివారం బెలిగుండు ఆలయ ప్రాంగణంలో కార్తీక వనబోజనం రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతి నాయుడు, జిల్లా అధ్యక్షుడు అర్జున్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వాల్మీకులు పిల్లలను విద్యావంతులనుగా చేయాలని, విద్యతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఎస్టీ రిజర్వేషన్ సాధనకు పార్టీలకతీతంగా పోరాడాలన్నారు. అంబన్న, డి.నాగేష్, హాళేబీడు వీరేష్, నరసప్ప, కప్పట్రాళ్ల మల్లికార్జున, సురేంద్ర నాయుడు, రాజేష్, హాలేబీడు కేశవ, సూరి, వరుణ్, అరికేర తిక్కస్వామి, అర్థగేరి శీనప్ప, కురువళ్లి ఈరన్న, శిరిగాపురం మల్లికార్జున పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి



ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో నాయకులు


ఆలూరు రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొలగవల్లి పీహెచ్‌సీలో మెరుగైన వైద్యం అందించాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కోరినట్లు టీడీపీ నాయకుడు ఐకాంత్ యాదవ్, జలంధర్ యాదవ్ ఆదివారం తెలిపారు. వైద్య పరికరాలు, ప్రహరీ నిర్మించాలన్నారు. 24గంటలు వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని విన్నవించామని చెప్పారు. మల్లికార్జున యాదవ్, కృష్ణ యాదవ్, వీరంజిని పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. మహిళ మృతి

ఆదోని, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో టో బోల్తాపడి మహిళ మృతి చెందింది. వివరాల మేరకు.. బళ్లారికి చెందిన మహంకాళమ్మ (50) తారాపురం ఆంజనేయస్వామి దర్శనానికి వచ్చింది. తిరిగి బళ్లారికి వెళ్లేందుకు ఆటోలో తిమ్మారెడ్డి బస్టాండుకు బయలుదేరింది. అయితే టూ టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో వేగంగా వస్తున్న స్కూటరిస్టును తప్పించే క్రమంలో ఆటో బోల్తా పడింది. మహంకాళమ్మ మృతి చెందగా మిగతా వారికి స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

హంద్రీ నీవా నుంచి జీడీపీకి నీటి విడుదల

పత్తికొండ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా ప్రధాన కాలువ నుంచి గాజులదిన్నె ప్రాజెక్టుకు ఆదివారం నీరు విడుదల చేశారు. గతంలో నవంబరు 9వ తేదీ నుంచి అయిదు రోజులు, రోజుకు 250 క్యూసెక్కుల చొప్పున విడుదల చేసి నిలిపివేశారు. కాగా ఆదివారం తిరిగి నీటి విడుదలను ప్రారంభించి, మొదటిరోజు 70 క్యూసెక్కుల నీరు, సోమవారం నుంచి రోజుకు 200 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తామని హెచ్ఎన్ఎస్ ఏఈ నజీర్ తెలిపారు.



గాజులదిన్నెకు వెళ్తున్న నీరు

రహదారి ఛిద్రం



మాధవరం - ఆలూరు రోడ్డును కలుపుతూ, పదేళ్ల క్రితం నిర్మించిన బైపాస్ శిథిలమైంది. భారీ వాహనాలు పట్టణలోకి రాకుండా ఈ దారిలో వెళ్తున్నాయి. అయితే నిర్వహణ లేకపోవడంతో దారిమొత్తం ఛిద్రమైంది. దీంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని లేదా నూతన రహదారి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. **- ఆదోని టౌన్**

కళ్లలో దుమ్ము



ఆలూరు పట్టణంలోని కర్నూలు-ఆదోని జాతీయరహదారి పనులు నిలిచిపోయాయి. పనులను సగం మధ్యలో వదిలేయడంతో వాహనాలు వెళ్లాయంటే చాలు దుమ్ము రేగుతోంది నిత్యం భారీ వాహనాలు వెళుతుండటంతో దుమ్ము రేగుతోంది. రోడ్డు పక్కన ఉన్న దుకాణదారులు, చిరు వ్యాపారుల అవస్థలు వర్ణనాతీతం. ఉన్నతాధికారులు రహదారి పనులను పూర్తి చేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. **- ఆలూరు రూరల్**

అన్ని రంగాల్లో ముందున్నాం

• కేజీఎఫ్ అధ్యక్షుడు జెట్టి కుసుమ కుమార్



మాట్లాడుతున్న జెట్టి కుసుమకుమార్

పత్తికొండ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కమ్మలు అన్ని రంగాలలో రాణిస్తూ సత్తా చాటుతున్నారని కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జెట్టి కుసుమ కుమార్ అన్నారు. పత్తికొండ రమ్యా రిసార్ట్‌లో ఆదివారం కార్తీక వనబోజనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కమ్మలను ఓకే వేదికపైకి తెచ్చేందుకు హైదరాబాద్‌లో ఏర్పాటుకు కృషిచేస్తున్నామన్నారు. పేదరికంలో ఉన్న కమ్మలను గుర్తించి చేయూత ఇచ్చేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం పదిమంది విద్యార్థులకు రూ.10వేల చొప్పున ఆర్థికసాయం అందించారు. కాకతీయ కమ్మ సంఘం అధ్యక్ష కార్యదర్శులు వేలూరు రామప్ప, జరగల రాంబాబు, కోశాధికారి బైరపు వైకుంఠప్రతాప్, వైకుంఠం మల్లికార్జున చౌదరి, కసీ హరి, మనోహర్‌చౌదరి, పురుషోత్తం చౌదరి, సురేష్‌చౌదరి, శివరాముడు చౌదరి, జేసిటీ తిమ్మప్ప పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చింతకుంట రామకృష్ణ

ఐఆర్ ప్రకటించాలి

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని ఎస్టీయూ మండల అధ్యక్షుడు చింతకుంట రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం ఆదోని, కౌతాళం మండల శాఖల సమావేశాన్ని నేషనల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలైనా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని, 12వ పీఆర్సీని ప్రకటించాలన్నారు. నాయకుడు మహాదేవప్ప మాట్లాడుతూ రూ.20వేల కోట్ల బకాయిలు చెల్లించాలన్నారు. వెంకోబా, గోపాల్, సుధాకర్, చంద్రశేఖర్, రామాంజనేయులు, ఖాదర్బాషా, రామ్మోహన్ రెడ్డి, అంజనేయ, లక్ష్మణ కాంతారావు, వీరన్న గౌడ్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఓడిన వారే ఇన్‌చార్జి

• ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్

ఆలూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆలూరు టీడీపీ ఇన్‌చార్జిగా తమకే ఇచ్చారని కొందరు సంబరాలు చేసుకుంటున్నారని టీడీపీ పాలసీ ప్రకారం ఎన్నికల్లో ఓడిపోయిన వారే ఇన్‌చార్జిగా కొనసాగుతారని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ తేల్చి చెప్పారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ పార్టీలో కొందరు అయోమయం సృష్టిస్తున్నారన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్ కూడా ఆలూరు ఇన్‌చార్జి గూర్చి ఏ ప్రస్తావన చేయలేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తొమ్మిదిమంది ఓడిపోయారని, ఇన్‌చార్జిని మార్చాలంటే అధిష్టానం నుంచి లేఖ వస్తుందన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్

ఉత్తమ ఎన్‌సీసీ ఆఫీసర్‌గా ఆదోని అధ్యాపకుడు

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఎన్‌సీసీ అధికారిగా ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల అధ్యాపడుకు ఎన్‌సీసీ లెఫ్టనెంట్ గోవింద్ అవార్డును అందుకున్నారు. ఆదివారం జాతీయ ఎన్‌సీసీ డే సందర్భంగా హైదరాబాద్‌లోని మెహిదీపట్నంలో తెలుగు రాష్ట్రాల డిప్యూటీ డైరెక్టర్ జనరల్ వీఎం రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. సహకరించిన కళాశాల యాజమాన్యానికి గోవిందు కృతజ్ఞతలు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న లెఫ్టినెంట్ గోవిందు

వాల్మీకులు ఐకమత్యాన్ని చాటాలి

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వాల్మీకులంతా ఐకమత్యాన్ని చాటాలని ఎమ్మెల్సీ మధుసూదన్, ఫుడ్ కార్పొరేషన్ మాజీ సభ్యురాలు టీడీపీ నాయకురాలు గడిసె కృష్ణమ్మ, మున్సిపల్ చైర్ పర్సన్ శాంత, మాజీ మండల అధ్యక్షుడు పంపాపతి, మాజీ జెడ్పీ చైర్మన్ తిక్కన్న అన్నారు. ఆదివారం మహేశ్వరి కళ్యాణ మండపంలో కార్తీకమాస వాల్మీకి వనభోజనాన్ని నిర్వహించారు. ఎస్టీ రిజర్వేషన్ సాధించేందుకు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం ఆటపాటలతో గడిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు, బహుమతుల ప్రదానం చేశారు. వెంకన్న, నరసయ్య, దస్తగిరి, రామ్‌భీం నాయుడు, సాయి ప్రసాద్, సింహం నాగేంద్ర, తిమ్మప్ప లక్ష్మణ, రాజశేఖర్, దుర్గేష్ హనుమన్న, వీరప్ప, ఆరెకల్ రామకృష్ణ, కల్లుబావిరాజు, రమేష్ నాయుడు, సత్య లక్ష్మీకాంత్, సుధాకర్ బాబు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వాల్మీకి నాయకులు

పనుల్లో నాణ్యత ఉండాలి



బొందిమడుగులలో సీసీ రోడ్డు పనులు

తుగ్గలి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్ల పనులు నాణ్యతతో చేపట్టాలని డీఈ శేషయ్య, ఏఈ వెంకటేశ్వర్లు సూచించారు. ఆదివారం బొందిమడుగులలో రూ.9 లక్షల ఉపాధి నిధులతో చేస్తున్న పనులను సర్పంచ్ చౌడప్ప, పంచాయితీ సలహాదారుడు ప్రతాప్ యాదవ్ ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు హామీ మేరకు నిధులు మంజూరు చేశారన్నారు. త్వరలో వంతెన నిర్మిస్తామన్నారు. వీరేంద్ర, కాశీం, వెంకటేశ్, హుశేన్, సుదర్శన్ ఉన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి

తుగ్గలి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీతో అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ మసాలా శ్రీనివాసులు అన్నారు. ఆదివారం పెండేకల్ ఆర్ఎస్‌లో సభ్యత్వ నమోదు నిర్వహించారు. సభ్యత్వం తీసుకుంటే రూ.5లక్షల బీమా వర్తిస్తుందన్నారు. ఖాసీం, ప్రసాద్, మోహన్, రంగస్వామి, నాగరాజు తదితరులు ఉన్నారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీతో క్రమశిక్షణ, దేశం పట్ల గౌరవాన్ని అలవడుతుందని గాంధీ విద్యాలయం (జనరల్) ప్రిన్సిపాల్ శాంతి, ఎన్‌సీసీ అధికారి నాగరత్న అన్నారు. ఆదివారం జాతీయ ఎన్‌సీసీ డే, కేజీబీవీ, నెహూ మోమెమోరియల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఎన్‌సీసీ అధికారి అనిల్ కుమార్ పాల్గొన్నారు.

మట్టిమాఫియాపై చర్యలు తీసుకోవాలి

మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్

ఆదోని, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆదోని ప్రాంతంలో ఎర్రమట్టి మాఫియాపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అవినీతికి పాల్పడుతున్న వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పర్యావరణ అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా మట్టిని తరలిస్తుంటే అధికారులుఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఆదోనిలో మట్టి, భూమాఫియా, రేషన్ మాఫియా రెచ్చిపోతున్నా ఒక్క కేసు కూడా నమోదు కాకపోవడం వెనుక అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు.

మహా ధర్నాను జయప్రదం చేయండి

ఆస్పరి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 26న నిర్వహిస్తున్న మహా ధర్నాను జయప్రదం చేయాలని కార్మిక సంఘం నాయకుడు బాలకృష్ణ ఏఐటీయూసీ కార్యదర్శి కృష్ణమూర్తి కోరారు. ఆ లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కనీస వేతనం రూ.28వేలు అమలు చేయాలన్నారు.

జనరల్ సెక్రటరీగా కిరణ్



పదవులకు ఎంపికైన సభ్యులు

వెల్దుర్తి, నవంబరు, 24 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఆర్యవైశ్య సంఘం మహాసభలు మంత్రి టీజీ భరత్ ఆధ్వర్యంలో అనంతపురంలో నిర్వహించారు. వెల్దుర్తి వాస్తవ్యులు కీలక పదవులకు ఎంపిక య్యారు. జనరల్ సెక్రటరీగా అత్తలూరి కిరణ్, కర్నూలు జిల్లా ఉపాధ్యక్షుడిగా వేముల శేషు, కార్యదర్శిగా చాటకొండ కార్తిక్‌లు ఎన్నికయ్యారు.

ఓటే వజ్రాయుధం

మద్దికెర, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఓటే వజ్రాయుధమని, 18 ఏళ్లు నిండిన వారు ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ హుశేన్‌సాహెబ్ తెలిపారు. ఆదివారం ఆయన బురుజుల, పెరవలి గ్రామాల్లో ప్రత్యేక ఓటు నమోదు కేంద్రాలను పరిశీలించారు. వీఆర్వోలు స్వర్ణలత, రామాంజులు ఉన్నారు.

సభ్యత్వ నమోదును వేగవంతం చేస్తాం

• టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్

ఆలూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పార్టీ అధినాయత్వం ఆదేశాల మేరకు ఆలూరు నియోజకవర్గంలో బుధవారం నుంచి సభ్యత్వ నమోదును వేగవంతం చేస్తామని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివ ప్రసాద్ తెలిపారు. ఆదివారం మాట్లాడుతూ నియోజక వర్గ నాయకులను కలుపుకుంటామన్నారు. కర్నూలు ప్రాంత అభివృద్ధిపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టారని, హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని క్యాబినెట్ నిర్ణయించడం హర్షణీయన్నారు.



మాట్లాడుతున్న వైకుంఠం శివప్రసాద్

కొండాపురంలో ఆగిన గరుసు తవ్వకాలు

అనుమతులు లేకుండా తవ్వితే చర్యలు: తహసీల్దార్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆదోని రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపురంలో గరుసు తవ్వితే ఊపేక్షించేది లేదని తహసీల్దార్ శివరాముడు పేర్కొన్నారు. 'రైతులకు గరుసు దొంగల బెడద' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. తాలుకా పోలీసులు, ఆర్ఐ ఖాసీం, వీఆర్వో బసవరాజును పరిశీలించమని ఆదేశించారు. ఇక నుంచి కొండల వద్ద పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు.

పంచాయతీకి ఆదాయం సమకూరేలా ప్రణాళిక

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

• ఆలూరు పంచాయతీ ఈవో ప్రభాకర్



ఆలూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీకి ఆదాయం సమకూరేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ఆలూరు మేజర్ గ్రామ పంచాయతీ కార్యనిర్వహణ అధికారి ప్రభాకర్ అన్నారు. ఆంధ్రజ్యోతికి ఆయన ఇంటర్వ్యూలో ఇచ్చారు.

ప్రశ్న: ఆలూరు షాపింగ్ కాంప్లెక్స్ ప్రాంభమైతే ఎంత ఆదాయం వస్తుంది?

జవాబు: సంత మార్కెట్‌లో నిర్మించిన దుకాణాల వేలం పాటలు పూర్తయ్యాయి. వీటి ద్వారా ప్రతి నెలా రూ. 1,20,900 ఆదాయం సమకూరనుంది.

ప్రశ్న: పట్టణంలో కుక్కల నియంత్రణకు మీ చర్యలేమిటి?

జవాబు: ఆడ కుక్కలకు సంతనోత్పత్తి కలగకుండా శస్త్రచికిత్స చేసేందుకు పశు సంవర్ధక శాఖ అధికారులను కోరాం.

ప్రశ్న: ఆలూరులో గతంలో గ్రీన్ పార్క్ నిర్మాణానికి స్థలం మంజూరైనా మరుగున పడింది. పార్క్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారా?

జవాబు: ఎంపీడీవో, ఉపాధి అధికారులతో చర్చించి పార్క్ ఏర్పాటుకు చర్యలు చేపడతాం.

ప్రశ్న: పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సమస్య పరిష్కా రానికి ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

జవాబు: పట్టణంలో ప్రతి వీధిలో వారానికోసారి కాలువలను శుభ్రం చేయిస్తున్నాం. ఓవర్ హెడ్ ట్యాంక్‌లను శుభ్రం చేయిస్తున్నాం. తాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: రోడ్లపై పశువులు ఉండడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది?

జవాబు: యజమానులు పశువులను రోడ్లపైకి వదలవద్దని నోటీసులు జారీ చేస్తాం. పట్టించుకోకుంటే పోలీసుల సహాయంతో ఆదోని లేదా మంత్రాలయం గోశాలలకు తరలిస్తాం.

వ్యవసాయ రంగాన్ని రక్షించుకుందాం

• రైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రామచంద్రయ్య



ఉత్తమ మహిళా రైతులను సన్మానిస్తున్న నాయకులు

పత్తికొండ టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలో పడిందని, రక్షించుకుందామని రైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రామచంద్రయ్య కోరారు. ఆదివారం రైతుల కార్తీక వనభోజనం నిర్వహించారు. డా.స్వామినాథన్ కమిటి సిఫారసులను అమలు చేయాలని, రైతుల రుణాలన్నీ మాఫీ చేయాలన్నారు. ప్రభుత్వాలు పారిశ్రామికవేత్తలకు రూ.కోట్లలో రాయితీలు ఇస్తే, బ్యాంకులు దివాలా తీయవా అని ప్రశ్నించారు. రైతులు నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులు, పెస్టిసైడ్స్‌తో దివాలాతీసి, ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విత్తన చట్టం లోపభూయిష్టంగా ఉండటంతోనే నకిలీ విత్తనాలతో రైతులు నట్టేట మునిగిపోతున్నారన్నారు. ఉత్తమ మహిళా రైతులను సన్మానించారు. జిల్లా కార్యదర్శి పంపన్నగౌడ్, సోమశేఖర్, మద్దికెర మాజీ సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి, సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి భీమలింగప్ప, రైతు సంఘం కార్యదర్శి రాజా సాహేబ్, నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు ఉమామహేశ్వర్, సురేంద్ర కుమార్, సర్పంచ్ రవిమోహన్, నాయకులు కారన్న, సిద్దు, ముని పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ ఎదుట ధర్నా



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు, ఆటో కార్మికులు

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): అఖిలపక్ష రైతు-కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 26న కలెక్టరేట్ ముందు నిర్వహించనున్న ధర్నాకు ఆటో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆ సంఘం నాయకుడు రాముడు కోరారు. కేంద్రంలో మూడో సారి అధికారం చేపట్టినా కార్మికులకు, రైతులకు సంక్షేమాలు విస్మరించిందని అన్నారు. ధర్నాకు చెందిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో కొండారెడ్డి, నరసన్న, ఆది, షబ్బీర్ తదితరులుపాల్గొన్నారు.

ఎమ్మెల్యే బీవీకి సన్మానం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

నందవరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రజా పద్దుల కమిటీ సభ్యుడిగా ఎన్నికైన ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డిని టీడీపీ నాయకులు ముగతి భార్గవ్‌యాదవ్, తులసీరామ్‌యాదవ్ ఆదివారం సన్మానించారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే బీవీతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న సర్పంచ్ బండేగురు అక్కామాంబదేవి, నాయకులు మఠం బండేగురుస్వామి

నందవరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే బీవీతోనే ఎమ్మిగనూరు నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని పూలచింత సర్పంచ్ బండేగురు అక్కామాంబదేవి, టీడీపీ సీనియర్ నాయకులు మఠం బండేగురుస్వామి అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలే లక్ష్యంగా టెక్స్‌టైల్స్ పార్క్ గురించి సీఎం చంద్రబాబు, సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లి పార్కు మంజూరు కృషి చేశారన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం చూపారన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలోని వైసీపీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. ఆదివారం మంత్రాలయం పట్టణ అధ్యక్షుడు వరదరాజులు, టీడీపీ నాయకులు అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో హమాలీ రాజు, మేడికొండ ఆంజనేయ, వన్నూరప్ప, వీరేష్, లక్ష్మన్న, ఉరుకుందుతో పాటు 36 మందికి టీడీపీ నియోజవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, రామకృష్ణారెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. పార్టీ కోసం పని చేసే కార్యకర్తలను గుండెలో పెట్టుకుని చూసుకుంటామన్నారు. సమావేశంలో మాధవరం మాజీ సర్పంచ్ రఘునాథరెడ్డి, రాఘవేంద్ర, టైగర్ రఘు, మేకల నరసింహులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపు హర్షణీయం

నందవరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో బీజేపీ ఘన విజయం సాధించడం హర్షణీయమని బీజేపీ మండల అధ్యక్షుడు కేశవరావుదేశాయి అన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. దేశంలో తిరుగులేని పార్టీగా బీజేపీ నిలిచిందన్నారు. దశల వారిగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన హామీలు ఎప్పటికప్పుడు నెరవేరుస్తున్నారన్నారు. బీజేపీ దేశంలో చేపట్టిన అభివృద్ధి పనులే మహారాష్ట్రలో మళ్లీ గెలిపించాయన్నారు. వచ్చే జమిలి ఎన్నికల్లో కూడా మళ్లీ బీజేపీ అధికారం చేపడుతుందన్నారు.

వాహనదారులకు లైసెన్స్ తప్పనిసరి



వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ

గోనెగండ్ల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని సీఐ గంగాధర్ సూచించారు. వాహనాలను తనిఖీ చేశారు. పత్రాలు పరిశీలించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 15 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రతి వాహనదారుడు తప్పక డ్రైవింగ్ లైసెన్స్ పొంది ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రాలయంలో ట్రా'ఫికర్'

● ఇబ్బంది పడుతున్న భక్తులు




ముఖద్వారం ముందు అడ్డదిడ్డంగా నిలిపిన వాహనాలు

మంత్రాలయం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. పట్టించుకోవాల్సిన అధికారులు పత్తా లేకుండా పోయారు. రెండు రోజుల క్రితం మంత్రాలయం వచ్చిన ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు నదితీరం, హెలిప్యాడ్ మైదానం, ప్రధాన ముఖద్వారం పరిశీలించి ట్రాఫిక్ నిబంధనలపై పలు సూచనలు చేశారు. అయినా మార్పు రాలేదు. శని, ఆదివారం, గురువారం సెలవు దినాల్లో భక్తుల తాకిడి అధికంగా ఉంటోంది. ప్రధాన రహదారుల్లో వాహనాలు నిలిచిపోయి భక్తులు నరకం చూస్తున్నారు. మాధవరం రోడ్డులో కిలోమీటరు మేర ఇరువైపులా వాహనాల పార్కింగ్ నాగులదిన్నెరోడ్డు, బస్టాండు రోడ్డు, ప్రధాన రోడ్డు, పంచాయతీ కార్యాలయం, నాగలదిన్నె నుంచి సంస్కృత పాఠశాల వెనుకవైపు ట్రాఫిక్‌లో గంటల తరబడి వాహనాలు నిలిచిపోయి ఒకరికొకరు దూషించుకుంటూ గొడవలు పడుతూ వెళ్తున్నారు. దీనికి తోడు సొంత వాహనాల్లో వచ్చిన భక్తులు ప్రైవేటు లాడ్జీల్లో పార్కింగ్ స్థలాలు లేక నడిరోడ్డుపైనే నిలుపుతున్నారు. ఆటోలు ఇష్టారాజ్యంగా చక్కర్లు కొట్టుతున్నాయి. దాంతో పాదచారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

● ట్రాఫిక్ నియంత్రణపై కఠినంగా వ్యవహరిస్తాం

సెలవు దినాల్లో మంత్రాలయంలో ట్రాఫిక్ ఇబ్బందులు పడుతున్నారని దీనిపై శాశ్వత పరిష్కారానికి కఠిన చర్యలు తీసుకుంటాం. ఆటోలు ఇష్టారాజ్యంగా తిరుగుతుండటం, సొంత వాహనాల్లో వచ్చిన భక్తులు రోడ్డుకిరువైపులా పార్కింగ్ చేయడంతో సమస్య తలెత్తుతుంది. ప్రధాన రహదారుల్లో వాహనాలు ప్రవేశించకుండా శ్రీమఠం అధికారులు రెవెన్యూ, గ్రామ పంచాయితీ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటాం.

- ఉపేంద్రబాబు, డీఎస్పీ, ఎమ్మిగనూరు



పంచాయతీ కార్యాలయం రోడ్డులో నిలిచిపోయిన వాహనాలు



ప్రధాన రోడ్డుపైనే వాహనాలను పార్కింగ్ చేసిన దృశ్యం

మంత్రాలయంలో భక్తుల కోలాహలం



మంత్రాలయం మఠం ప్రాంగణంలో భక్తుల రద్దీ

మంత్రాలయం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో కోలాహలంగా మారింది. ఆదివారం సెలవు దినం, కార్తీక మాసం కావటంతో దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, మహారాష్ట్ర ల నుంచి దాదాపు 80 వేల మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. అద్దె రూములు దొరకక పోవడంతో మధ్వమార్గ్ కారిడార్ ముందే భక్తులు చలికివణుకుతూ పిల్లాపాపలతో బసచేశారు. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదితీరం,బస్‌స్టాండ్ ప్రాంతం భక్తులతో కోలాహలంగా మారింది. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. పీఠాధిపతి పాదదర్శనం కోసం గంటలతరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

చెక్క రథంపై ప్రహ్లాదరాయల ఊరేగింపు

రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు చెక్క రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆదివారం నవమి శుభ దినం సందర్భంగా మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో పండితులు,అర్చకులు రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ మూర్తిని చెక్క రథంపై ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజలసేవ నిర్వహించారు. అంతకముందు స్వామి వారికి పాదపూజ చేశారు. పూర్ణభోధపూజ మందిరంలో పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మూలరాములకు బంగారునాణేలతో అభిషేకం చేశారు.

ఎమ్మిగనూరులో కార్తీక వనభోజనాల సందడి



కార్తీక వనభోజన కార్యక్రమంలో మాట్లాడుతున్న రుద్రగౌడ్

ఎమ్మిగనూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలో ఆదివారం కార్తీక వనభోజనాల సందర్భంగా ఆయా సామాజిక కులవర్గీయులు సందడి చేశారు. పట్టణంలోని వీరశైవ కల్యాణ మండపంలో వీరశైవ సంక్షేమసంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహించారు. అలాగే వైడబ్ల్యూసీఎస్ సొసైటీ ఆవరణంలో కుర్నిదైవాచారం ఆధ్వర్యంలో కుర్ణికుల కార్తీక వనభోజనం కార్యక్రమం నిర్వహించారు. అలాగే ఇండస్ స్కూల్‌లో కురువ వనభోజనం, భక్త కనకదాసు కార్యక్రమన్ని నిర్వహించారు. అలాగే ఆదోని రోడ్డులో ఉన్న విశాల గార్డెన్‌లో కమ్మసంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సామాజిక వర్గాల కులబాంధవులు ముందుగా ఉసిరి చెట్టుకు, కులదైవాలకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వీరశైవలింగాయత్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై రుద్రగౌడ్, నాగరాజు గౌడ్, సంఘం నాయకులు విజయ్ కుమార్, మూర్తి, నాగరాజు గౌడ్, పరమేష్, కుర్ణి కుల బాంధవులు మున్సిపల్ చైర్మన్ డా రఘు, టీడీపీ నాయకులు మాచాని సోమనాథ్, నాయకులు లింగప్ప, బుడ్డప్ప, ఉరుకుందు, నాగేశప్ప, నీలకంటలు పాల్గొన్నారు. అలాగే కురువ సంఘం నాయకులు మద్దిలేటి, బీరప్ప, రామకృష్ణ, గోపాల్‌లు పాల్గొన్నారు. కమ్మ సంఘం నాయకులు వెంకట్రావు, మహేంద్ర బాబు, భాస్కర్, ఉమాపతినాయుడు, ఎంసీకే దుర్గా ప్రసాద్, మనోహర్ చౌదరి, భాస్కర్ల చంద్రశేఖర్, మురళి, రామలింగప్ప, వీరేష్, నరసింహరావులు పాల్గొన్నారు.

కామన్‌దొడ్డిలో మురుగు వీధులు



కామన్‌దొడ్డి గ్రామంలో ఇళ్ల ముందు నిల్వ ఉన్న మురుగునీరు

కోసిగి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కామన్‌దొడ్డి గ్రామంలోని పలువీధులు మురుగు నీటితో కంపు కొడుతున్నాయి. దీంతో గ్రామస్థులు ఇబ్బంది పడుతున్నారు. గ్రామ మధ్యలో ఉన్న రోడ్డుపై డ్రైనేజీ కాలువలు లేక మురుగునీరు నిల్వ నిలిచి పాచిపట్టి కంపు కొడుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయితీ అధికారులు పట్టించుకోవడం లేదంటున్నారు. దోమల బెడదతో రోగాల బారిన పడుతున్నామని, సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని గ్రామస్థులు వాపోతున్నారు. కొన్ని నెలలుగా మురుగునీరు రోడ్డు మధ్యలో నిల్వడంతో నడవడానికి వీల్లేకుండా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'ఉల్లి'క్కిపడేలా ధర

- గ్రామీణ మార్కెట్‌లో కిలో రూ. 60 పైమాటే



గోనెగండ్ల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కోస్తున్నప్పుడు కన్నీళ్లు తెప్పించే ఉల్లి. కొనే సమయంలో సామాన్యులకు కంట నీరు తెప్పిస్తోంది. రోజురోజుకు ధర అమాంతంగా ఎగబాకుతున్నాయి. ప్రస్తుతం గ్రామాల్లో కిలో రూ. 60 నుంచి రూ. 70 మధ్య అమ్మకాలు జరుగుతున్నాయి. దీంతో ఉల్లి కొనాలంటేనే వినియోగదారులు బెంబేలెత్తి పోతున్నారు. ఈ 20 రోజుల్లో రెండింతల ధర పెరిగింది. ఇది వరకు నాలుగైదు కేజీలు నిలువ ఉంచుకునేవారు ప్రస్తుతం అరకేజి తో సరిపెట్టుకుంటున్నారు. మహారాష్ట్ర పంట రాష్ట్రానికి దిగుమతి అయ్యేవరకు ఇదే ధరనే కొనసాగుతుందని స్థానిక వ్యాపారులు తెలుపుతున్నారు.

బాలికల హాస్టల్ ఏర్పాటు చేయాలి



మంత్రి సవితకు వినతి పత్రం ఇస్తున్న ఆర్‌ఏవీఎఫ్ నాయకులు

మంత్రాలయం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో బాలికల హాస్టల్ లేకపోవడంతో చాలా మంది విద్యార్థినులు చదువులకు దూరమవుతున్నారని రాయలసీమ అభ్యుదయ విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఖాజా, కృష్ణ అన్నారు. ఎమ్మిగనూరుకు వచ్చిన బీసీ సంక్షేమ జౌళి శాఖ మంత్రి సవితను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ పశ్చిమ ప్రాంతమైన మంత్రాలయంలో కరువుల వల్ల వలసలకు నిలయంగా మారిందని, బాలికల హాస్టల్ ఏర్పాటు లేకపోవడం వల్ల అనేక మంది చదువులు మానేసి కూలీ పనులకు వలసలు వెళ్తున్నారని తెలిపారు. వెంటనే నియోజకవర్గ కేంద్రంలో బాలికల హాస్టల్‌ను ఏర్పాటు చేసి బాలికల విద్యకు సహకరించాలని కోరారు. స్పందించిన మంత్రి సవిత హాస్టల్ ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, వీరాంజనేయులు పాల్గొన్నారు.

యువ కవికి సత్కారం



అనంతపురంలో కవి దుంపాల వీరేష్‌కు సన్మానం చేస్తున్న లేపాక్షి ఫౌండేషన్ సభ్యులు

పెద్దకడబూరు, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగలాపురం గ్రామానికి చెందిన దుంపాల వీరేష్‌కి అనంతపురం జిల్లా కేంద్రీయ గ్రంథాలయంలో నిర్వహించిన కవి సమ్మేళనంలో ఆయనకు ఆదివారం ఏపీ జానపద కళల సాహితీ సంస్థ తొలి అధ్యక్షుడు పోట్లూరి హరి, అనంతపురం ఎమ్మెల్యే వెంకటేశ్ ప్రసాద్ శాలువా కప్పి సన్మానించారు. కవి సమ్మేళనంలో ఆయన రచించిన వలస కూలీలకు సంబంధించిన ఎంత కష్టం.. ఎంత కష్టం అనే శీర్షిక ఉత్తమ కవితగా ఎంపిక చేశారు. లేపాక్షి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మన్ వడ్డీ సుధాకర్ ప్రశంస పత్రం, జ్ఞాపికను అందజేశారు.

రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



స్వామివారికి పూజలు చేస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

పెద్దకడబూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హనుమాపురం గ్రామంలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా ఆదివారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఆయన తనయుడు తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి దివాకర్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు దేవాలయ పెద్దలు వారిని సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమాకాంత్ రెడ్డి, భరద్వాజ్ శెట్టి పాల్గొన్నారు.

ఆగని వలసలు

ఖాళీ అవుతున్న గ్రామాలు



గోనెగండ్ల నుంచి వలస వెళ్తున్న కూలీలు

గోనెగండ్ల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల మడలంలో వలసలు ఆగడం లేదు. గత వారం రోజులుగా రోజు 10 ఆటోల్లో ప్రజలు వివిధ ప్రాంతాలకు వెళ్తున్నారు. ఆదివారం పలు గ్రామాల నుంచి దాదాపు 20 ఆటోల్లో గుంటూరు, హైదరాబాద్, రాజంపేట ప్రాంతాలకు కూలీలు వలసలు వెళ్లారు. గ్రామాల్లోని పంట పొలాల్లో పనులు లేక పోవడంతో వలసలు వెళ్తున్నామని ప్రజలు వాపోయారు. గ్రామాల్లో అధికారులు సైతం ఉపాధి పనులు కల్పించడంలేదు. అరకొర పనులు కల్పించినప్పటికీ కూలీ డబ్బులు గిట్టుబాటు కాకపోవడం, అవికూడా సకాలంలో చెల్లించకపోవడంతో కుటుంబాల పోషణ కష్టమవుతుండడంతో వలసలు వెళ్తున్నామని ప్రజలు పేర్కొంటున్నారు. ఇళ్లకు తాళలు పడడంతో గ్రామాల్లోని వీధులు నిర్మానుష్యంగా మారాయి.



గోనెగండ్లలో ఇళ్లకు తాళాలు వేసిన దృశ్యం

పెండింగ్ డీఏ చెల్లించాలి

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న డీఏలను చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వానికి రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ ప్రధాన కార్యదర్శి ఎస్ఎం షరీఫ్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడు తూ సకాలంలో డీఏలు, పీఆర్సీలు చెల్లిస్తామన్న ఎన్నికల హామీలను నెరవేర్చాలని కోరారు. దీర్ఘకాలికంగా ఉన్న ఆర్థిక బకాయిలు చెల్లించాలని కోరారు. కూటమి ప్రభుత్వంపై ఉద్యోగ ఉపాధ్యాయులు పెట్టుకున్న ఆశలను వమ్ము చేయరాదన్నారు.

పిల్లర్లకే పరిమితమైన జగనన్న కాలనీ

మాధవరం జగనన్న కాలనీలో పిచ్చిమొక్కలు

మంత్రాలయం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పక్క ఫొటోలో ఉన్నవి అందంగా పెంచిన మొక్కలు అనుకుంటే పొరపాటే. జగనన్న కాలనీలో గ్రామానికి దూరంగా...వర్షం వస్తే నీరు నిలిచిపోయే స్థలాన్ని ప్లాట్లుగా ఇచ్చారు. అవి కాస్త లబ్ధిదారులు నిర్మించుకోవడానికి వెనకంజ వేయడంతో పిచ్చిమొక్కలు పెరిగి అధ్వానంగా తయారైంది. బేస్‌మెంట్‌పై పిల్లర్స్ వేసి వదిలి వేయడంతో దానిచుట్టూ తీగలు అలుముకున్నాయి.



పిల్లర్లపై పిచ్చి మొక్కల తీగలు



మాధవరంలో జగనన్న కాలనీలో పిచ్చిమొక్కలు



జగనన్న కాలనీలో పిల్లర్స్ కడ్డీలకు అలుముకున్న పిచ్చిమొక్కలు